విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

సోమవారం 05।మే।2025   8 పేజీలు

కదల్లేని వారికి కార్డులేలా...!

- సీనియర్ సిటిజన్స్‌కు కార్డుల కష్టాలు
- సచివాలయాలకు వెళితేనే ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది
- ఇంటి వద్దనే కార్డులు మంజూరు చేయాలంటున్న వృద్ధులు

విశాలాంధ్ర బ్యూరో - ఏలూరు : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డులను పొందలేని పరిస్థితి పలువురు వృద్ధులలో నెలకొన్నది. కార్డు కోసం సచివాలయాలకు వెళ్లాల్సి రావటమే ఇందుకు కారణం.వృద్ధులలో కొందరు అనారోగ్య సమస్యలు దృష్ట్యా నడవలేని వాళ్ళు ఉన్నారు. వారు కార్డు కోసం సచివాలయానికి వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బంది కరంగా మారింది.అసలే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం గం.10 సమయం దాటిన తర్వాత వృద్ధులు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి.ఒకవేళ ఎక్కడికైనా బయటకు వెళ్లి వస్తే వడదెబ్బ బారిన పడుతున్నారు. జిల్లాలో 85 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు సుమారుగా 15 వేల మంది ఉన్నారు. గ్రామాలు,కొన్ని పట్టణాలలో సుదూరంగా సచివాలయాలు ఉన్నాయి.అక్కడ వరకు ఎండలో వెళ్లలేక కార్డులు పొందలేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సచివాలయాలలో ఉదయం 11 వరకు సిబ్బంది రావడం లేదు. ఆ తర్వాత కూడా రకరకాల పనులు,ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితులలో వృద్ధులు ఎండలో అంత దూరం వెళ్ళలేక, వెళ్లినా గంటల తరబడి నిరీక్షించలేకపోతున్నారు. ఈ పరిస్థితులలో సచివాలయాలకు వెళ్లి సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా గ్రామ/వార్డు సచివాలయాలలో సీనియర్ సిటిజన్ కార్డులను సిబ్బంది మంజూరు చేస్తున్నారు.ఎవరైతే 60 ఏళ్ల వయసు దాటిన వృద్ధులు ఆధార్ జిరాక్స్,పాస్పోర్ట్ సైజు ఫోటో,బ్లడ్ గ్రూప్,ఆధార్ లింక్ మొబైల్ నెంబర్ తీసుకుని వచ్చిన వారికి ▶మిగతా 2లో..

యాళ్లబండి ఆశయాలను

ముందుకు తీసుకెళ్లాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర - వీరవాసరం : స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ అగ్రనేత యాళ్లబండి పోలిశెట్టి స్మారక స్థూపం పునర్నిర్మాణానికి వీరవాసరం మండలం నౌడూరు సెంటర్లో ఆదివారం శంకుస్థాపన చేశారు. గత మార్చిలో రోడ్డు విస్తరణలో పనుల్లో పోలిశెట్టి స్మారక స్థూపాన్ని తొలగించడం, దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన అనంతరం స్థూపం పునర్ నిర్మాణంకు పంచాయతీ అనుమతించడం విధితమే. ఈ సందర్భంగా సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ యాళ్లబండి పోలిశెట్టి నాటితరం రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని,అంటరానితనంకు వ్యతిరేకంగా, పెత్తందారీలకు వ్యతిరేకంగా, డెల్టా ప్రాంతంలో ▶మిగతా 2లో..

పీసా చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - వేలేరుపాడు: పిసా కమిటీ సభ్యులకు ఏజెన్సీ ప్రాంతంలో ఉండే చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బంధం నాగేశ్వరరావు అధ్యక్షతన పీసా కమిటీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిసా చట్టాలపై అవగాహన గిరిజన ప్రాంతంలో ఆయా కమిటీలు చేయాల్సిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు.నూతనంగా ఎన్నుకోబడిన పీసా కమిటీ సభ్యులు గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం పోరాటాలు చేయాలన్నారు. భవిష్యత్తులో పీసా కమిటీ సభ్యులు వలన ఆదివాసీలకు మంచి జరగాలని ఆకాంక్షించారు. భారత కమ్యూనిస్టు పార్టీ,సిపిఐ ఎంఎల్ కలిసి నూతన మండల కమిటీని సోమవారం ఏర్పాటు చేస్తారని తెలిపారు.కమిటీ ఎన్నిక అనంతరం భవిష్యత్ కార్యాచరణ రూపకల్పన జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండి మునీర్,మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ▶మిగతా 2లో..

ప్రమాదకర హోర్డింగ్ తొలగింపులో

అధికారులు సమయమనంతో వ్యవహరించాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : అకాల వర్షాలు, వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో కోతలు పూర్తి చేసిన ధాన్యం సేకరణ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానికంగా నీట్ పరీక్షలు కేంద్రాలను తనిఖీ చేసే క్రమంలో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో 216 రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రస్తుత రబీ సీజన్లో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంలో ఇప్పటి 2,63,076 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చేసి, లక్ష్యాలను అధిగమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 2,79, 689 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. అనపర్తి నియోజక వర్గంలో 25,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి ▶మిగతా 2లో..

సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లాలో ఆదివారం ఉదయం కురిసిన భారీ వర్షాలకు తీసుకోవలసిన చర్యలపై వివిధశాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీకాన్ఫెరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఆదివారం కురిసిన భారీ వర్షాలు,ఈదురు గాలుల కారణంగా జన జీవనం స్తంభించకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా చాలా ప్రదేశాలలో చెట్లు నేలకూలాయని, విద్యుత్ స్థంబాలు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, అధికా రులు యుద్ధప్రాతిపదికన వెంటనే స్పందించి జెసిబిల సహాయంతో చెట్లు తొలగించి రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా విద్యుత్ లైన్లకు మరమ్మత్తులు చేసి,విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించాలన్నారు. చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.క్షేత్రస్థాయి సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకోవాలన్నారు. గ్రామాలూ, పట్టణాలలో శిధిలావస్థలో ఉన్న భవనాలు, ▶మిగతా 2లో..

అకాల వర్షం ... రైతులకు తీవ్ర నష్టం

నీట మునిగిన ధాన్యం రాశులు

విశాలాంధ్ర - కాజులూరు : అకాల వర్షాలు రైతులు పాలిట శాపంగా మారుతున్నాయి. అది ఖరీఫ్ అయినా, రబీ అయినా రైతులకు, కౌలు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. లక్షలాది రూపాయల పెట్టుబడితో వరి సేద్యం అయినా, మామిడి అరటి తోటలు అయినా, నష్టాలు మాత్రం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి ఒంటిగంట వరకు ఎడతెరిపిలేని వర్షం, భారీ ఈదురుగాలులు వేయడంతో చేతికొచ్చిన పంట నీట మునగటంతో పాటు, మామిడి పంటపై కూడా తీవ్ర ప్రభావం చూపింది. మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుండగా, 100 హెక్టార్ల వరకు మామిడి తోటలు ఉన్నాయి. రబీలో ఇప్పటివరకు 50% మాసూలు పూర్తి కాగా మరో 50% కోత కోయవలసి ఉంది. ప్రతి ▶మిగతా 2లో..

కదల్లేని వారికి

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు ఇచ్చి దానిని పూర్తి చేయించి సచివాలయాల సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దాంతో ఆన్ లైన్ లో ప్రభు త్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతున్నది. ఆ కార్డులో వృద్ధుడు, వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్, సీనియర్ సిటిజన్ కార్డు నెంబర్,బార్ కోడ్, చిరునామా, కాంట్రాక్ట్ నెంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైల్ నం బరు, ఎమర్జెన్సీ నంబర్లు పొందు పరచి ఉంటున్నాయి. ఈ సీనియర్ సిటిజన్ కార్డులు పలు విధాలుగా వృద్ధులకు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కార్డుతో పలు ప్రయోజనాలు...

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.వృద్ధాప్య పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఇందుకు కారణంగా ఈ కార్డులోనే పుట్టిన తేదీ నమోదయి ఉంటుంది.మిగతా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలన్నా ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాలలో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టికెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకులలో వృద్ధులకు ప్రత్యేకించి అధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ల స్కీములకు కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది.ఆసుపత్రులలోనూ సీనియర్ సిటిజన్ కార్డు ఉపయోగపడుతుంది.రైల్వే టికెట్ కౌంటర్లో త్వరితగతిన టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చు.ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితులలో ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేస్తున్నట్లుగా సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

యాళ్లబండి ఆశయాలను

(మొదటిపేజీ తరువాయి)

భూపోరాటాల్లో ఎన్నో ఉద్యమాలు నడిపించారని గుర్తు చేశారు. బెనారస్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన యాళ్లబండి బడుగు బలహీన వర్గాలకు అండగా రాజకీయాల్లోకి వచ్చారని,సిపిఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, నౌదూరు సర్పంచ్ గా, విస్సాకోడేరు సమితి ఉపాధ్యక్షులుగా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. యాళ్లబండి సేవలకు గుర్తింపుగా గ్రామస్తులు నౌదూరులో ఆయన స్మారక స్థూపాన్ని పునర్ నిర్మాణం కావడం హర్షణీయం అన్నారు.ఏఐటియుసి రాష్ట్ర నాయకులు డి.వి.వి.ఎస్.వర్మ మాట్లాడుతూ యాళ్లబండి మాతరం వారికి మార్గదర్శకులని ఆయనతో కలిసి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు. దళితులకు దేవాలయాల్లో ప్రవేశం,పేదలకు భూపంపిణీ పోరాటాల్లోను యాళ్లబండి కీలకంగా వ్యవహరించారని అన్నారు.ఏ ఆశయ సాధనకు యాళ్లబండి పనిచేశారో వాటిని ముందుకు తీసుకెళ్లాలన్నారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, రిటైర్డు ప్రిన్సిపాల్ సంకు మనోరమ, స్థూపం కమిటీ కన్వీనర్ కదలి మృత్యుంజయుడు,సిపిఐ గ్రామ నాయ కులు లింగం సత్యనారాయణ, కటిక సత్యనారాయణ, మామిడిశెట్టి సత్యనారాయణ,కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

మన్నవ యామిని,ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, మండల కార్యదర్శి బాడిశ రాము, రామవరం సర్పంచ్ పిట్టా ప్రసాద్,జిల్లా కౌన్సిల్ సభ్యులు పిట్టా వీరయ్య,కురిమెళ్ళ వెంకటేశ్వర్లు, కరటం వెంకటేశ్వర్లు, పీసా కమిటీ సభ్యులు గంగాల గంగరాజు, మచ్చ చంద్రరావు,సోడే ముత్యాలరావు, మడకం విజయ్, కరక వినోద్, కుమార్ ధర్మరాజు, కన్నారావు పండా హుస్సేన్, కాకా ముత్యాలరావు, తెల్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోపనిచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కట్టడాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈదురు గాలులకు ప్రచార హోర్డింగ్ లు వంటివి కూలి పోకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం తడిసిపోకుండా ఉండేలా రైతులకు టార్పాలిన్లు అందించాలన్నారు. ట్రాఫిక్ నకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వెంటనే కూలిన చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.అవసరమైన ప్రదేశాలలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు.ఎక్కడైనా పశు నష్టం జరిగితే వెంటనే నివేదిక అందించాలన్నారు.భారీ వర్షాలు, ఈదురు గాలుల కారణంగా జిల్లాలో మీడియా గ్రూప్ లలో వచ్చే అంశాలను పరిగణనలోనికి తీసుకుని, తక్షణమే స్పందించి ఆయా ప్రాంతాల లోని అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. త్రాగు నీరు కలుషితం కాకుండా చూడాలని, పూర్తిగా పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

CHANGE OF NAME

I, SURISETTY JULEE (New Name), W/o SURISETTY LAZAR, Previously Called JULEE GUDAPATI (Old Name), Resident of D.No. : 1-181, Near Church, Komarada Village, Bhimavaram Mandal, W.G.Dt., A.P., Pin 534208. I have changed my name from JULEE GUDAPATI (Old Name) To SURISETTY JULEE (New Name) for all practical purposes.

సమయమనంతో వ్యవహరించాలి

(మొదటిపేజీ తరువాయి)

కాగా 17,903 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తి చెయ్యడం జరిగిందన్నారు. అదే విధంగా గోపాలపురం లో 32,105 ఎమ్ టి లకు, 30,038 ఎమ్ టి లు , గోకవరం మండలం లో 8758 ఏం టి లకు 8,637 ఎమ్.టీ లు , కొవ్వూరు పరిధిలో 70,479 కి 67,928 ఎమ్ టి లు , నిడదవోలు లో 89,099 ఎమ్‌టిలు , రాజమహేంద్రవరం రూరల్ లో 14,782 ఎమ్ టి లకు గాను 14,605 ఎమ్ టి లు , రాజానగరం మండలం పరిధిలో 38,641 మెట్రిక్ టన్నుల ధాన్యం కోతలు పూర్తి కాగా వాటిలో 37,911 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చెయ్యడం జరిగిందని తెలిపారు. ఇంకా కోతలు పూర్తి చేసిన వాటిలో 16,613 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని, ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం దృష్ట్యా తగిన సూచనలు ఇవ్వడం, మిల్లులకు తరలించడం పై దృష్టి పెట్టాల్సి ఉంటుందన్నారు.

గోదావరి పరివాహక నదీ తీరంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రమాదకర హోర్డింగులు విషయంలో, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ లైన్స్ విషయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. వర్షాలు, ఈదురు గాలులు వీస్తున్న నేపథ్యంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. నగరంలో, మునిసిపల్ పరిధిలో, మండల కేంద్రాల్లో భారీ హోర్డింగ్ విషయంలో వాటి సురక్షిత, పటిష్టత విషయంలో తనిఖీలు చేయాలన్నారు. సరైన నిర్వహణ, పటిష్టత లేని వాటిని తొలగించే క్రమంలో సంయమనంతో వ్యవహరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లో హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. గోదావరీ తీరం లో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పూర్తి అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇటీవల గోదావరి నదిలో మునిగి మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. అటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలన్నారు. అందుకు సంబంధించి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్డీవోలు జిల్లా అధికారులు తాసిల్దారులు మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తీవ్ర నష్టం

(మొదటిపేజీ తరువాయి)

రైతు ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టడంతో ఈ వర్షాలకు మరింత నష్టం చేకూర్చింది. ఈ వర్షంతో మరో 10 రోజులపాటు కోతలు వాయిదా వేయవలసిన వచ్చిందని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయ అధికారి అశోక్ మాట్లాడుతూ మండలంలో జగన్నాధగిరిలో ఒక ప్రాంతంలో సుమారు 100 ఎకరాలకు సంబంధించి దాన్యం నీట మునిగాయని, పలుచోట్ల విద్యుత్తు వైర్లపై చెట్లు కొమ్మలు పడడంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడడంతో, యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించడం జరిగిందని ఆయన తెలిపారు. నేల నందిన వరి, ధాన్యం తడిసిన వాటిపై ఎకరాకు ఐదు కేజీల ఉప్పు ద్రావణం జల్లినట్లయితే ధాన్యం మొలకరాకుండా ఉంటుందని వ్యవసాయ అధికారి అశోక్ సూచించారు.

అకాల వర్షంతో స్తంభించిన భీమవరం

విశాలాంధ్ర- భీమవరం టౌన్: పశ్చిమగోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం పరిసరాల ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున ఒక్కసారిగా ఉరుములు, మెరుపులుతో కూడిన భారీ వర్షం కురియడంతో ప్రధాన రోడ్లపై భారీ వృక్షాలు నేలకు ఒరిగాయి కొన్ని ప్రాంతాల్లో కరెంటు స్తంభాలపై పడటంతో స్తంభాలు విరిగిపోయాయి, దీంతో ఉదయం నుంచే కరెంట్ నిలిచిపోయింది, దీంతో వ్యాపారస్తులు తీవ్ర నష్టం పోయారు అలాగే కొన్ని రహదారులు జలమయమై ప్రయాణికులు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది, జిల్లాలో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా వరి రైతులు పండించిన పంట మాసూళ్లలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. చిరు వ్యాపారులు, ఆటో వాలాల జీవితాలను ఛిద్రం చేసింది, అలాగే భీమవరం నరసయ్య అగ్రహారంలో భారీ చెట్టు పడటంతో ఆటో చిద్రమైంది. జీవనోపాధి కోల్పోయామని ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటుంది.

అలరించిన సంగీత కచేరి

విశాలాంధ్ర - గణపవరం: అలరించిన సంగీత కచేరి సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి వారి 258 జయంతి మహోత్సవం సందర్భముగా సంగీత కచేరి నిర్వహించినట్లు త్యాగరాజ కళాక్షేత్రం అధ్యక్షులు మాదేటి సురేష్ కుమార్ తెలిపారు. సంగీత కచేరిని తాడేపల్లిగూడెం వాస్తవ్యులు కుమారి సుస్మిత గాత్రం చేయగా కీబోర్డ్ షేక్ వాలీ తబలా అల్లం శంకరరావు సహకారం అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వ్యక్తి ఆర్ వి ఎస్ రాజు గ్రామ ప్రజలు పుర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలిపారు.

విద్యుత్ వెలుగులతో కొయ్యలగూడెం పట్టణం

విశాలాంధ్ర వార్తకు స్పందన...

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారికి ఇరువైపులా జంగారెడ్డి గూడెం రోడ్డులోని టీటీడీ కళ్యాణ మండపం నుండి గోపాలపురం రోడ్డు ఎస్సీ కాలనీ వరకు కిలోమీటర్ మేర ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల లైట్లు వెలగకపోవడంతో విశాలాంధ్ర పత్రికలో అంధకారంలో కొయ్యలగూడెం అని వార్త ఆదివారం ప్రచురణ కావడంతో సంబంధిత జాతీయ రహదారి డి. ఈ. శ్రీనివాస్ స్పందించి, కాంట్రాక్టర్ ఎం. రవీంద్ర బాబుకు ఆదేశాలు జారీ చేయడంతో, ప్రధాన సెంటర్లో ఉన్న పోలీస్ స్టేషన్ ఎదురుగా గల పెద్ద స్తంభం లైటులను రిపేరు చేశారు. విద్యుత్ స్తంభాలపై నిలిచిపోయిన లైట్లను మరమ్మతులు చేశామని వారు అన్నారు. విశాలాంధ్ర పత్రికకు ముప్పిడి చినబాబు అభినందనలు తెలిపారు.

నాటుసారా విక్రయదారునికి రూ 3 వేలు జరిమానా

విశాలాంధ్ర-టి.నరసాపురం: నాటుసారా విక్రయదారునికి రూ 3వేలు జరిమాన విధించినట్లు చింతలపూడి ఎక్సైజ్ సిఐ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నవోదయం 2.0లో భాగంగా చింతలపూడి ఎక్సైజ్ పరిధిలో పాత నాటు సారా కేసులో నిందితుడు టి నరసాపురం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన బందెల మరియాదాసుకు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారము సత్ ప్రవర్తన తో మెలుగుతానని మరియు దాసుకు బైండ్ ఓవర్ బాండ్ జారీచేయగా సదరు బాండ్ ను ఉల్లంఘించి మళ్ళీ నాటు సారా కేసులో నిందితుడు గా పట్టుబడడంతో సదరు బైండ్ ఓవర్ బాండ్ ను ఉల్లంఘించి నందుకు గాను ఆయనకు జరిమాన వేసి చెల్లించవలసిదిగా టి నరసాపురం మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. సదరు వ్యక్తి రూ.3,000 జరిమానా ను చలానా రూపములో ప్రభుత్వానికి బ్యాంకులో చెల్లించినట్లు ఆయన తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి

విశాలాంధ్ర- ఏలూరు: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నేడు సోమవారం జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని మండల,డివిజనల్,లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలి పారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహపకరణాలు దగ్ధం

రూ.6లక్షల ఆస్తి నష్టం...

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఆదివారం ఉదయం ఖండవల్లి సుధీర్ కుమార్ ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో, ఏసీ, ఫర్నిచర్, గృహపకరణాలు, ఫ్రిడ్జ్, విలువైన సామాగ్రి అగ్నికి ఆహుతి అయ్యాయి. సుమారు 6 లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం ఉంటుందని సుధీర్ తెలిపారు. ఆదివారం ఉదయం మేఘావృతమై ఈదురుగాలులతో, వచ్చిన వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో, విద్యుత్ తరచూ వచ్చి పోవడంతో, సుధీర్ ఇంటిలో ఉన్న ఏసీ నుంచి మంటలు చెలరేగాయి, గమనించిన కుటుంబ సభ్యులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇల్లు అంతా పొగతో కమ్మివేయడంతో ప్రయత్నాలు అన్ని విఫలం చెందాయి. స్థానికులు జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం అందజేయడంతో, సంఘటన స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు ఆరు లక్షలు ఆస్తి నష్ట ఉంటుందని బాధితులు తెలుపుతున్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

విశాలాంధ్ర - గణపవరం: బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని గణప వరం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధి కారి ఆర్ బేబీ శ్రీ లక్ష్మీ అన్నారు. కిశోరి వికా సం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సరిపల్లె సర్పంచ్ చనుమూరి లక్ష్మీ భవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వారానికి రెండు రోజులు మంగళవారం, శుక్రవారాలు ప్రతీ గ్రామం లోను 11-18 సంవత్సరాల వయస్సు ఉన్న కౌమారా బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక విద్య, బాలల హక్కులు అయిన రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్, సైబర్ నేరాలు, ఫోక్స్ మొదలగున వాటిపై అవగాహనా పెంచుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో గణపవరం పంచాయతీ కార్యదర్శి దార్ల శివరాం ప్రసాద్ గ్రేడ్1, సరిపల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి దైవాల రామాంజనేయులు, గణపవరం సెక్టర్ సూపర్వైజర్ పి తులసి, ఎం ఎస్ కె లక్ష్మి నరసమ్మ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు విఓఎ లు కౌమారా బాలికలు పాల్గొన్నారు. .

తాగునీరు సరఫరాకు ట్యాంకు వితరణ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ప్రజా అవసరాల నిమిత్తం పరింపూడి గ్రామపంచాయతీకి ప్రముఖ వ్యాపార వేత్త, సంఘ సేవకులు,కొల్లూరి సత్తి బాబు మంచినీటి ట్యాంకును బహుక రించినట్టు గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు ఎటువంటి అవసరతలు ఉన్నా పంచాయతీ ద్వారా ఉచితముగా , మంచినీటి ట్యాంకును ఉపయోగించుకోవచ్చని అన్నారు. ప్రజా అవస రాల నిమిత్తం ఎంతో సహృదయంతో పంచాయితీకి ఉచితముగా మంచి నీటి ట్యాంకును తయారు చేయించిన సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే పంచాయతీకి మంచినీటి ట్యాంకును అందజేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

భగీరధుని స్ఫూర్తితో లక్ష్యాలు సాధించాలి

-డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర -భీమవరం : భగీరధుని స్ఫూర్తితో జీవితంలో అను కున్నది సాధించవచ్చని డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కలెక్టరేట్ వశిష్ట సమావేశపు మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన భగీరథ మహర్షి జయంతి వేడుకల కార్యక్రమంలో భగీరథ మహర్షి చిత్రపటానికి డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్సుతో గంగను దివి నుంచి భువికి దించిన భగీరథుడు మహ తపస్వీ అన్నారు. పట్టుదలకు మారుపేరుగా నిలిచారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చని అన్నారు. భగీరధుడు మహా జ్ఞాని అని, దీక్షకు, సహనానికి ప్రతిరూపం అని అన్నారు. ఎంత కష్టం అయినను లెక్కచేయకుండా అనుకున్నది సాధించే వారిని భగీరథ మహర్షితో పోలుస్తారని పేర్కొన్నారు. నేటి యువత లక్ష్యసాధనకు భగీరథ మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బి.సి సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ వసతి గృహం అధికారి సిహెచ్ మోహన్ రావు, కదలి శ్రీనివాస్, కె ఎస్ డి.ప్రసాద్, బి లక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : శుభకార్యాలలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి పేద ప్రజలకు పంపిణీ చేసే పావని ప్రియా సేవా సంస్థ ఆదివారం ఆనంద ఇంద్ర మండపంలో మిగిలిపోయిన ఆహార పదార్థాల సేకరించి భీమవరం లేపాక్షి కాలనీలో పేద ప్రజలకు పంపిణీ చేశామని ఆ సంస్థ వ్యవస్థాపకుడు పైల బాబు తెలిపారు,

ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

- జిల్లాలో 97.5శాతం హాజరు
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : జిల్లాలో నీట్ యూజీ పరీక్షలు ప్రశాంతంగా పూర్తి చేయడం జరి గిందని,97.5శాతం హాజరైనట్లు జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి తాడేపల్లిగూడెంలో ఏర్పాటుచేసిన రెండు నీట్ యూజీ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా ఏర్పాట్లు, విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు,భద్రత,బందోబస్తు తదితర ఏర్పా ట్లను పరిశీలించారు. నిట్ లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో 1,128 పరీక్షలకు హాజరు కావాల్సి ఉం డగా 1,108 మంది, శశి ఇంజనీరింగ్ కళాశాలలో 758 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 739 మంది పరీక్షలు హాజరయ్యారు. మొత్తం 1,886 మంది పరీక్షలకు హాజరు కావ లసి ఉండగా 1,847 పరీక్షలకు హాజరు కాగా, 39 మంది గైరు హాజరు కావడం తో మొత్తం 97.5శాతం హాజరై నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. పరీక్ష నిర్వ హణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్త కుండా సజావుగా పూర్తి చేశామని తెలిపారు. పరీక్షలను ప్రశాంతంగా పూర్తి చేయడానికి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, మెంబర్ అద్నాన్ నయీం అస్మి పర్యవేక్షించగా, ఇతర సభ్యులు డిఆర్ఓ, డిఇఓ, ఐబి డిప్యూటీ ఎస్పీ,డి. ఐ.ఓ., పాల్గొ న్నట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలను సజావుగా పూర్తి చేయ దానికి విధులను నిర్వర్తించిన అధికారులకు, పోలీస్ అధికా రులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ వెంట డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు,కె. ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డిఓ కతీబ్ కౌసర్ భానో, పరీక్షల కోఆర్డి నేటర్ ఎస్.జయరామ్, తదితరులు ఉన్నారు.

చెక్కపల్లిలో చెట్టు కూలి బాల గోవింద్ మృతి

విశాలాంధ్ర - ముసునూరు : మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం ఈదురు గాలులతో పాటు కురిసిన భారీ వర్షానికి చెట్టు కూలి బాలుడు పై పడి మరణించిన సంఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. చెక్కపల్లి గ్రామం జంగాల పేట చెరువు ఒడ్డున నివసిస్తున్న మామిళ్ళ సురేష్ ఇంటిపై వెలగ చెట్టు కూలి అతని కుమా రుడు బాల గోవింద్(12) అక్కడికి అక్కడే మృతి చెందగా కుటుంబ సభ్యులకు గాయాలపాలు అయ్యారు. రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ గొలుసు పార్ధ సారధి వారు నూజివీడు ఏరియా ఆసుపత్రిలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తక్షణ సహాయం కింద 25 వేల రూపాయలు అం దించారు. మండల వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్థంభాల సైతం నేలకొరిగి రవాణా వ్యవస్థ సంభించగా నూజివీడు సీఐ రామకృష్ణ, ముసు నూరు ఎస్ఐ చిరంజీవి తక్షణ చర్యలు చేపట్టారు.

పాడి రైతులకు న్యాయం చేసేందుకు కృషి : ఎమ్మెల్యే చంటి

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : పాడి రైతు లకు నూరుశాతం న్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ చేస్తోన్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమా నికి పెద్దపీట వేస్తోంది. ఇదే క్రమంలో పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై సమీకృత దాణా పంపిణీ చర్యలు చేపట్టింది. ఏలూరు 46వ డివిజన్‌లోని పశు వైద్యశా లలో ఆదివారం నిర్వహి చిన సబ్సిడీ దాణా పం పిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. పాడి రైతు లతో మాట్లాడి వారి సమ స్యలను అడిగితెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులందరికీ న్యాయం చేయాలనే సత్ సంకల్పంతో ముందుకు వెళ్తోం దన్నారు. ఇదేక్రమం లో పాడిరైతులకు కూడా అండగా ఉండాలనే ఆలోచనతోనే గతంలో ఎన్నడూలేని విధం గా 50 శాతం సబ్సిడీపై దాణాను అందించే కార్యక్ర మానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం, వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ బి. జ్యోతి స్వరూప పాల్గొన్నారు.

వ్యాయామం, యోగాపై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - లింగపాలెం : విద్యార్థి దశ నుంచి యోగాపై అవగాహన కలిగి ఉండాలని ధర్మా జీగూడెంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులలో గ్రంథాలయఅధికారి వెంకటరమణ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వ్యాయామం,యోగాపై అవగాహన కల్పించారు. వీటిని అలవర్చుకోవటం వల్ల క్రమశిక్షణ అలవడు తుందని దీనివల్ల భవిష్య త్తులో మంచి పౌరులుగా తయారవుతారని తెలి పారు. అనుకున్న లక్ష్యం వైపు వెళ్లి మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు చెడు అలవాటులకు దూరంగా ఉంటారని వివరించారు.

పి రాజవరంలో శ్రీ భగీరథ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : లక్ష్యసాధనకు మహర్షి భగీరథుడని స్ఫూర్తిగా తీసుకోవాలని మం డల సంగ రా సంక్షేమ సంఘం నాయకులు తంగెళ్ల వెంకటరావు సూచించారు. ఆదివారం పి రాజవరం లో భగీరథ మహర్షి జయంతి వేడుకలు సంగర సం క్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని దివి నుంచి భూమికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని అన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. లక్ష నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగర పెద్దలు కోడూరి లక్ష్మారావు, కోడూరి కళ్యాణ్, కోడూరి ఏసు, నక్క శ్రీను, నక్క దుర్గాప్రసాద్, నక్క వెంకటేశ్వరరావు, నక్క పెద్ద శ్రీను, నాగరాజు, గుర్రం కళ్యాణ్, కోడూరి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టమహోత్సవాల్లో ఎమ్మెల్యే ధర్మరాజు దంపతులు

విశాలాంధ్ర - ఉంగుటూరు : మండల కేంద్రం ఉంగుటూరులో 5 రోజుల పాటు జరుగనున్న సప్త ఆలయాల శిఖర, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రసిద్ద వేద పం డితులు పెద్దింటి అనిల్ కుమా రాచార్యులు బ్రహ్మ త్వంలో శాస్త్రోక్త విధానంలో పూజాదికాలు నిర్వహించారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దంపతులు, ఆయన సోదరుడు భీమ రాజు దంప తులు పీటల మీద కూర్చొనగా, వేద పండితులు తొలుత విఖానస స్తోత్ర పారాయ ణం,గోపూజ జరి పించారు. కార్యక్రమంలో భాగంగా విష్వక్ సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్ష ధారణ అఖండ దీపా లంకరణలు, వాస్తుపూజలు నిర్వహిం చారు. భూస మేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆల యాల ఏడింటి ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 8వరకు కొనసాగనున్నాయి.

మానవత్వం చాటుకున్న మంత్రి నాదెండ్ల

ప్రమాద బాధితులకు అండగా నిలిచిన నాయకుడు

విశాలాంధ్ర - భీమడోలు : విజయవాడ నుండి కాకినాడ వెళ్తున్న ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, భీమడోలు సమీపం లోని ఎం.నాగులపల్లి అడ్డరోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాన్ని చూసి మానవత్వం చాటుకున్నారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఇన్నోవా కారు ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాదాన్ని గమనించిన మంత్రి వెంటనే తన వాహనం ఆపి గాయపడిన వ్యక్తులకు సహాయం అందించారు. అంబులెన్స్ కు కాల్ చేసి ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.తన కాన్వాయ్‌లోని ప్రోటోకాల్ వాహనాన్ని అంబులెన్స్‌కు ఎస్కార్ట్ వాహనంగా ఉపయోగించి వేగంగా ఆసుపత్రికి చేరేలా చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీకి స్వయంగా ఫోన్ చేసి గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ కార్యదర్శిగా బాలకృష్ణ

విశాలాంధ్ర- ఉంగుటూరు : వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ కార్యదర్శిగా ఉంగుటూరుకి చెందిన డాక్టర్ పెనుగొండ బాలకృష్ణ నియమితులయ్యారు. బాలకృష్ణ ఉంగుటూరు ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబును మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్ట పరచటానికి కమిటీలు వేసి బలోపేతం చేస్తానన్నారు. త్వరలో ఉంగుటూరులో సమావేశం ఏర్పాటు చేస్తానన్నారు. బాలకృష్ణకు పదవి ఇవ్వడం పట్ల మండలంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు హర్ష వ్యక్తం చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను వెలికి తీయడానికి గ్రంథాలయం ముఖ్య భూమిక పోషిస్తుందని గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో పాల్గొని విజ్ఞానం సముపార్జించడం అభినందనీయమన్నారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సురేష్ జైన్ సహకారంతో బహుమతులు అందిస్తామని తెలిపారు. నీతి కథలు, జనరల్ నాలెడ్జ్, పుస్తక పఠనం ,పుస్తక సమీక్ష, నృత్యం తదితరాలపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్.కె బుక్స్ స్టేషనరీ అధినేత సురేష్ జైన్, గ్రంథాలయాధికారి యస్.వెంకటేశ్వరరావు , ట్రైనర్ జి.శ్యామ్, ఇందుకూరి శివాజీ వర్మ, గ్రంథాలయ సిబ్బంది, చదువులు , విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నేడు సోమవారం జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్,మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల,డివిజనల్,లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు.ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

లక్ష్య సాధనకు భగీరథ మహర్షి స్ఫూర్తి

- కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలో కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర - ఏలూరు : లక్ష్య నిర్దేశంతో చేసే ఏ ప్రయత్నంలోనైనా విజయాన్ని సాధించవచ్చని భగీరథ మహర్షి నిరూపించారని జిల్లా కలెక్టర్ కె . వెట్రీ సెల్వి పేర్కొన్నారు.ఆదివారం ఏలూరు కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ నీటిని దివి నుంచి భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షి అని అన్నారు.ఆమహనీయుడును స్మరించుకోవడం, జయంతి వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. మహనీయుల గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.మహనీయుల జీవిత విశేషాలను ప్రజలకు తెలియజేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహా మహర్షి వేడుకలను నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వర రావు, సహాయ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ టి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య,కలెక్టరేట్,బి సి సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడవద్దు

- వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన జేసీ ధాత్రిరెడ్డి

విశాలాంధ్ర - ఉంగుటూరు : రైతుల విజ్ఞప్తి మేరకు జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 2.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి తెలిపారు.ఆదివారం ఉంగుటూరు మండలం గోపినాథ్ పట్నం రైతు సేవా కేంద్రం వద్ద వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శని,ఆదివారం వచ్చిన అకాల వర్షాలకు, రైతులు వద్దనుండి ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందకుండా వారి సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో వారి పండించిన ధాన్యాన్ని అమ్ముకోవాల్సిందిగా తెలిపారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు టార్గెట్ పెంచాలని స్థానిక రైతులు కోరగా, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు రైతు సేవా కేంద్రాలు ద్వారా 51,32,300 గోనె సంచులను రైతులకు సరఫరా చేసి ఇంతవరకు 2.05 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రైతుల కోరిక మేరకు పెంచిన లక్ష్యానికి అనగా 0.45 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యానికి గాను 11.25 లక్షల గోనెసంచాల అవసరం కాగా ప్రస్తుతం 8,95,410 గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో ఉన్న అన్ని రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతుల వద్ద నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట జిల్లా పౌర సరఫరాల మేనేజర్ పి.శివరామమూర్తి ,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ భాషా, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ రవికుమార్, పలువురు వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర- ఉంగుటూరు: టార్గెట్లు సమయం లో ఇవ్వక పోవడం వలన ఉంగుటూరు మండలంలో సంచులలో పట్టిన సుమారు 20000 మెట్రిక్ టన్నుల ధాన్యం బుధవారం కురిసిన భారీ వర్షానికి తడిసిపోయాయని ఏలూరు జిల్లా వ్యవసాయ మండలి మాజీ సభ్యుడు, వైఎస్ఆర్సిపి రాష్ట్ర బూత్ వింగ్ కమిటీ కార్యదర్శి యెలిశెట్టి పాపారావు అన్నారు. ఆది వారం ఈ విషయాన్ని విలేకరులకు తెలిపారు. అమ రావతి పునః నిర్మాణం సందర్భంగా మోదీ భజనలో మునిగిన ఈ కూటమి ప్రభుత్వం రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట టార్గెట్ లు లేక వర్షానికి తడిసిపోయిందన్నారు. రైతుల సుమారు 10 రోజుల నుంచి ధాన్యం సంచులలో పట్టి నెట్టి వేసి రవాణా కోసం లారీల కోసం చూస్తుంటే టార్గెట్లు అయిపోయి నవి మీరు బహిరంగ మార్కెట్ లో అమ్ముకోండి అని అధికారులు చెప్పటం విడ్డూరంగా ఉంద న్నారు. ప్రతీ గింజ కొంటాను ప్రభుత్వం చెప్తుంది కద అని అధికారులను అడుగుతూ ఉంటే వారి వద్ద నుండి ఏ విధ మైన సమాధానం లేదని రైతులు వాపోయారని బాబ్జి అన్నారు. ఇంకా రైతుల దగ్గర మా ఉంగుటూరు మండలంలో 35000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ఆ ధాన్యంను తక్షణమే రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని వైయస్సార్ పార్టీ తరుపున పాపారావు బాబ్జి డిమాండ్ చేశారు .

అకాల వర్షంతో బెంబేలెత్తిన అన్నదాతలు

విశాలాంధ్ర - పాలకోడేరు : మొన్నటి వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై వడగలుపులతో ప్రజలంతా ఉక్కిరి బిక్కిరితో అల్లాడి పోయారు. ఆదివారం ఉదయాన్నే వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు సంభవించి ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ఇప్పటికే మండలంలోని చాలా గ్రామాలలో రబీ సీజన్ కి సంబంధించి కోతలు పూర్తవడంతో యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని తేమశాతం ఎక్కువగా ఉండడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టడంతో అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో అన్నదాతలంతా ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరై ఆందోళనకు గురయ్యారు. నాలుగు నెలలుగా తమ రెక్కల కష్టం నమ్ముకుని పండించిన పంట తడిసిపోయి ఎక్కడ తమ నోటి కాడ కూడు చేజారి పోతుందన్న ఆందోళనతో తమ కష్టాన్ని కాపాడుకోవడానికి అన్నదాతలు పడిన తాపత్రయన్ని చూసినవారికి కన్నులు చెమర్చాయి.

ప్రశాంతంగా ముగిసిన నీట్ - 2025 పరీక్షలు

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన నీట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు.ఈమేరకు పరీక్ష మధ్యాహ్నం గం.2 నుంచి సాయంత్రం గం. 5వరకు కొనసాగింది. అయితే విద్యార్థులను 11 గంటల నుంచే కేంద్రంలోకి అనుమతించారు. లోపలికి అనుమతించే క్రమంలో విద్యార్థినులను క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో మొత్తం 5 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.అన్ని పరీక్ష కేంద్రాల్లో 1,200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా ఇందులో 1,162 మంది హాజరవగా, మరో 38 మంది పరీక్షకు హాజరుకాలేదు. ప్రభుత్వం జూనియర్ కళాశాల,కోటదిబ్బ పరీక్ష కేంద్రంలో 240 మందికి,232 మంది,కస్తూరిబా మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల,కోటదిబ్బ పరీక్ష కేంద్రంలో 360 మందికి,347 మంది, సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్, ఆర్.ఆర్.పేట, పరీక్షా కేంద్రంలో 240 మందికి గాను 234 మంది,కేంద్రీయ విద్యాలయ, గోపన్నపాలెం పరీక్ష కేంద్రంలో 240 మందికి, 235 మంది,ప్రభుత్వం ఉన్నత పాఠశాల,గోపన్న పాలెం,పరీక్షా కేంద్రంలో 120 మందికి, 114 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.

ప్రతిఒక్కరూ పుట్టినరోజున మొక్కలు నాటాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం: ప్రతిఒక్కరూ పుట్టినరోజున మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని రాణా వెల్ఫేర్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్ అన్నారు. మండలంలోని బండివారిగూడెం సచివాలయం ఆవరణలో కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గం రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు బచ్చు చిన్న రామాంజనేయులు పుట్టినరోజు సందర్భంగా జాకీర్ హుస్సేన్ మామిడి మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం రక్షించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి యశోద వెంకటేశ్వరరావు, సచివాలయ మహిళా పోలీసు సాయి ప్రసన్న, నరసింహారావు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - నరసాపురం: నరసాపురం మండలం తూర్పుతాళ్ళు చామకురివారిమెరక లో వేంచేసి వున్న దాసాంజనేయ స్వామి ఆలయ మూడోవ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.సొసైటీ కార్యదర్శి పోసింశెట్టి వెంకట సూర్య కుమార్ (నాని) కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయంతో అన్న సమారాధన జరిపారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా కామిశెట్టి వెంకటేష్

విశాలాంధ్ర - కడియం : కడియం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు కామిశెట్టి వెంకటేష్, కడియం గవర్నమెంట్ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌గా నియమితులైయ్యారు. రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కడియం మండలం జనసేన నాయకుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఏ గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, జనసేన మండలాధ్యక్షులు ముద్రగడ జమ్మి, వెలుగుబంటి నాని, జనసేన నాయకులు, జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిరాం కిరణ్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి నాని, ముద్రగడ జమి, గుత్తుల హరిప్రసాద్, నాగిరెడ్డి రామకృష్ణ, ఆదిమూలం సాయిబాబా, పంతం గణపతి, మర్రి శంకర్, వడ్డీ దుర్గామహేష్, ఉండమట్ల ప్రభాకర్, కళ్యాణపు సూరిబాబు,తమ్మిశెట్టి ప్రసాద్, సంజీవ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల అందజేత

విశాలాంధ్ర - కడియం : కడియం మండలంలోని ప్రాంతాలలో నిఘా నిమిత్తం ఏర్పాటు చేయడానికి కావలసిన సీసీ కెమెరాలను కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ సభ్యులు అందజేశారని కడియం సిఐ ఏ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాలలో ప్రజల సౌకర్యార్థం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి, కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ పల్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మరియు గ్రామస్తుల సహకారంతో ఒక లక్ష రూపాయలు విలువచేసే సీసీ కెమెరాలు కడియం సిఐకి అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ సీసీ కెమెరాలు అందరికీ చాలా ఉపయోగకరంగా ఉంటాయని, నేరస్తులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే మంచి చేసిన కడియపులంక ఆంజనేయస్వామి కమిటీ పల్ల సుబ్రహ్మణ్యం మరియు సభ్యులకు మరియు గ్రామస్తులకు ధన్యవాదాలు తెలిపారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం రాశులు

విశాలాంధ్ర - కరప : ఉన్నట్టుండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి అకాల వర్షం కురవడంతో కరప మండలంలో పలుచోట్ల ధాన్యం రాశులు తడిసి పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికి అంది వచ్చిన పంట అకాల వర్షానికి తడిసిన ధాన్యం రాశులను ప్రభుత్వం కొని రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

భగీరథుని జీవితం స్ఫూర్తిగా తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : భగీరథుని జీవితం నుంచి మనం స్ఫూర్తి పొందాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పిలుపు ఇచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ.. దివి నుంచి భువికి గంగను తీసుకుని రావాలన్న భగీరథుని లక్ష్యం.. చిత్తశుద్ధి, కఠోర సాధన ద్వారానే సాధ్యం అయిందని చెప్పారు. భగీరథుని జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలన్న ఉద్దేశ్యంతో ఆయన జయంతి వేడుకలను జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. గంగను దివి నుంచి భువికి తీసుకు రావాలన్న లక్ష్యాన్ని చిన్నతనంలోనే నిర్దేశించుకొని నిరుత్సాహ పడకుండా ప్రయత్నించి సఫలీకృతం అయ్యారన్నారు. వయస్సు చిన్నదైన లక్ష్యం పెద్దది అని.. అయినా అకుంఠిత దీక్షతో అనుకున్న లక్ష్యాలను సాధించిన వ్యక్తి భగీరథుడు అన్నారు. సంగం నీళ్ళు ఉన్న గ్లాసును చూసి ... 'సగం నీళ్ళు మాత్రమే ఉన్నాయని' ప్రతికూల స్వభావం కలిగి ఉన్న వ్యక్తులు భావిస్తే, సానుకూల స్వభావం కల వారు 'గ్లాసు ఖాళీగా ఉండకుండా సగం నిండి ఉంది' అని ఆశావహ దృక్పథం కలిగి ఉంటారని చెప్పారు. ఎప్పుడు సానుకూల ఆలోచనా ధోరణి కలిగి ఉంటామో, అప్పుడు అనుకూల ఫలితాలు సాధ్యం అవుతాయని పేర్కొన్నారు. బృహత్తర లక్ష్యాలను సాధించిన వారి నుంచి ప్రేరణ పొందాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు సానుకూల వైఖరి అవసరమని తద్వారా మెరుగైన ఫలితాలు సాధించడం సాధ్యం అవుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి టి.సీతారామ మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె. ఎన్. జ్యోతి, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంరక్షణే ధ్యేయం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : మూలారెడ్డి వారసుడిగా ఆయన తీరులోనే వ్యవహరిస్తూ ప్రతి కార్యకర్తకు అండగా ఉండటమే కాకుండా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలను సంరక్షించుకోవడమే ధ్యేయంగా ముందుకు సాగుతానని ప్రభువు సాక్షిగా మరొక్కసారి తెలియజేసుకుంటున్నానని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రపురం నియోజకవర్గంకె గంగవరం చిన్న మంద చర్చిలో ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధించిన నేపథ్యంలో బిక్కవోలు మండలం కాపవరంకు చెందిన కొండేపూడి రవి మొక్కుకున్న మొక్కుబడి ఎమ్మెల్యే నల్లమిల్లి చెల్లించారు.ఈ సందర్భంగా కొండేపూడి రవి, పాస్టర్ సలాది జాకర్య, చిన్న మంద సంఘ సభ్యులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సత్తి దేవదాన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వైద్యుడు డాక్టర్ వెంకన్నరావు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కరప : ఆదర్శ వైద్యుడిగా వేలంగి గ్రామానికి చెందిన డాక్టర్ బోండా వెంకన్న రావు పేద ప్రజలకు గత 51 సంవత్సరాలుగా వైద్య సేవలు అందిస్తూ మానవసేవే మాధవ సేవగా గుర్తించి ఉచిత డాక్టర్‌గా పేరు తెచ్చుకున్నారని కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ పేర్కొన్నారు. వేలంగి గ్రామం శ్రీనివాసా నర్సింగ్ హోమ్ నందు ఆదివారం గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత 51 సంవత్సరాలుగా పేదలకు వైద్యం అందించడమంటే సమాజం పట్ల బాధ్యత, అంకితభావం ఉన్నవారికే అది సాధ్యమవుతుంది అన్నారు. వైద్య వృత్తిని వ్యాపారంగా చూస్తున్న ఈ రోజుల్లో సేవ చేయడం అంటే భగవంతుడితో సమానమేనని నానాజీ తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ వైస్ ఛాన్సర్ ఏవి కృష్ణంరాజు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ పిండి లక్ష్మణమూర్తి, డాక్టర్ ఆనంద్, డాక్టర్ బోండా సూర్యరావు, బందారు మురళి, ఏఎంసీ చైర్మన్ ముద్రగడ రమేష్ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన తరగతులు

విశాలాంధ్ర - కాకినాడ : వేసవి విజ్ఞాన తరగతులు కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యారినీ విద్యార్థులచే ఉదయం 8 గంటల నుండి 8:30 గం.ల వరకు పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 8:30 గం.ల నుండి 9:20 గం.ల వరకు వీ సత్య బాల DRDA సిబ్బంది వారు విద్యార్థినీ, విద్యార్థులకు పర్సనాలిటీ డెవలప్మెంట్, మేధాశక్తి పెంచే రకరకాల ఆటలు ఆడించి విద్యార్థుల సృజనాత్మక నైపుణ్యతను పెంచే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు దీ సూర్యనారాయణ మాస్టారు విద్యార్థులకు ఇంగ్లీష్ గ్రామర్ మరియు విద్యార్థులచే పొడుపు కథలు నీతి కథలు చెప్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఋచీమా ప్రసాద్, జిల్లా కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి ఉప గ్రంథాలయ అధికారి కిషోర్, జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది, నాగేంద్ర కుమార్, వీరాజు, అరుణ, ప్రియదర్శిని, స్థానిక పాఠశాలల విద్యార్థులు 43 మంది పాల్గొన్నారు.

సహజ కవి జోడాలకు సత్కారం

విశాలాంధ్ర -తాళ్లపూడి : సమాజంలో నిత్యం ఎదురయ్యే అనేక ఘటనలు, సామాజిక అంశాలు, మనసును ఉల్లాస పరిచే వాతావరణం వంటి అనేక ఘటనలు తన కలంతో కవితలుగా మారుస్తూ తన జీవితంలో కేవలం ఉద్యోగం, కుటుంబం, సేవా కార్యక్రమాలు అనే అంశాలతో పాటు కవి హృదయాన్ని ఆవిష్కరిస్తోన్న మండల ఏఎస్ఓ జోడాల ఆదివారం రాజమహేంద్రిలో జరిగిన ఓ కార్యక్రమంలో ఘన సన్మానాన్ని అందుకున్నారు. సాహిత్య గోదావరి వార్షిక విభిన్న కవితల సంకలన పుస్తక ఆవిష్కరణ వేడుకలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జోడాల వెంకట్ మాట్లాడుతూ కవి తన జ్ఞానాన్ని సమాజ హితంగా వాడాలి అని సమస్యలపై తమ వాణి వినిపించాన్నారు. అధ్యక్షులు ర్యాలీ శ్రీనివాస్ మాట్లాడుతూ కవి కదిలించే భాషను వాడాలన్నారు. జోడాల వెంకట్ రాసిన ఆఖరిఫోటో కవిత ప్రశంసనీయమన్నారు. కాశ్మీర్ ఘటనపై రాసిన ఆఖరిఫోటో కవిత వారంతపు కవితలలో విజేత గా నిలిసింది రాసిన జోడాల వెంకట్‌ను శాలువ, జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సాహితీ గోదారి సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాజా, ముప్పి కామేశ్వరరావు, దొర్భల, మూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఒక పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందచేశారు. కాకినాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ లో 3వ సంవత్సరం చదువుతున్న హరికేశ్వరి అనే పేద విద్యార్థిని చదువు నిమిత్తం రూ. 26,000 లను భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటా అనేక మంది పేద విద్యార్థులకు వారి ఫీజు నిమిత్తం తమ ట్రస్ట్ తరపున ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నట్టు వివరించారు. కొంత మంది పేద విద్యార్థులను దత్తత తీసుకుని వారి చదువు విషయంలో వారి పూర్తి బాధ్యతలు తామే తీసుకు న్నట్టు తెలిపారు. అంతే కాకుండానీరు పేదల కోసం తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించడం జరుతోందన్నారు. తమ ట్రస్ట్ తరపున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిత్యం చేస్తూనే ఉంటామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వివరించారు.

గుదే శ్యామలకు ఎన్టీఆర్ కీర్తి పురస్కారం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం కృష్ణం పాలెంలోని అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుదే శ్యామల డా ఎన్టీఆర్ కీర్తి పురస్కారం అందుకున్నారు. శనివారం విజయవాడలోని హోటల్ ఐలాపురం వేదికగా ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా జరిగిన అవార్డుల ప్రదా నోత్సవం వేడుకల్లో మాజీ స్పీకర్ మండలి బుద్ద ప్రసాద్ చేతుల మీదుగా శ్యామల ఈ అవార్డు అందుకున్నారు. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ నిర్వాహకులు డా అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో శ్రీ శ్రీ కళా వేదిక అంతర్జా తీయ చైర్మన్ డా కత్తిమండ ప్రతాప్ అధ్యక్షులుగా జరిగిన ఈ అవార్డుల ప్రధానోత్సవ వేడుకలో ఇరు తెలుగు రాష్ట్రాల నుంచి సామాజిక సేవా రంగంలో ప్రసిద్ధి చెందిన దాదాపు 30 మందికి డా ఎన్టీఆర్ కీర్తి పురస్కారం పేరున మెమెంటో, శాలువా, సర్టిఫికెట్ అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంఆర్ఐ విభాగం కన్వీనర్ రాజశేఖర్, రాష్ట్ర ఆర్య వైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక, శ్రీశ్రీ కళా వేదిక కన్వీనర్ కొల్లి రమావతి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో తడిసిన ధాన్యం

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లిలో ఆదివారం ఉదయం ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాల వర్షం నీళ్లతో నిలిచిపోయే మండలంలో పల్లంట్ల కురుకూరు దుద్దుకూరు తదితర గ్రామాలలో భారీ వర్షం వల్ల ప్రజలు పలు ఇక్కట్లకు గురయ్యారు రోడ్లుపై వర్షం నీరు నిలిచిపోవడంతో వాహన సాధకులు ఇబ్బందులు పడ్డారు ముఖ్యంగా దేవరపల్లి పల్లల్ల రోడ్డు మధ్య పోలవరం కుడి కాలవ వంతెనపై వర్షపు నీరు విపరీతంగా ఉండటంతో రాకపోకలకు మోటార్ సైకిల్ ఆటో వానసాధకులు ఇబ్బందులు పడ్డారు. గత వారం రోజుల నుండి ఎండ అధిక ఉష్ణోగ్రత వలన వర్షం పడటంతో వృద్ధులు పిల్లలు కొంత ఉపశమనం పొందారు ఈ వర్షం వల్ల దేవరపల్లి మండలం కృష్ణం పాలు హైవే రోడ్డుపై ధాన్యం ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. రైతులు బరకాలు కప్పినప్పటికీ వర్షం ఎక్కువ రావడంతో కప్పిన బారకల్లోకి వర్షంతో ధాన్యం తడిసిపోయింది

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర - గండేపల్లి : 32 ఏళ్ల కలయిక మధురమైనదని 1993-94 పూర్వపు విద్యార్థులు మండపాక అప్పన్నదొర, కట్టు రవిబాబు అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట సాయి బాలాజీ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు వారి కుటుంబాలతో సహా హాజరై ఉదయం నుండి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు. ఆట, పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 సంవత్సరాల తీపి జ్ఞాపకాలను నెమరువేసుకోవడం జరిగిందన్నారు. ఇక నుండి ప్రతి ఏడాది ఆత్మీయ కలయికను నిర్వహించుకుంటూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని తీర్మానించు కోవడం జరిగిందన్నారు.

గొప్ప మహర్షి భగీరథుడు : తోట

విశాలాంధ్ర - జగ్గంపేట : ఒంటి కాలుపై తపస్సు చేసి ఆకాశము నుండి గంగను భూమి మీదకు తీసుకువచ్చిన గొప్ప మహర్షి భగీరథుడు అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని రామవరంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. భగీరథుని విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రావుల గణేష్ రాజా, గుర్రం మహాలక్ష్మి రామకుర్తి జగాలు, భూమాడి గణపతి, సప్ప రఘు, కాపవరపు ప్రసాద్, రావుల స్వామి, మొగిలి శ్రీను, రావుల సురేష్ కుమార్, కొండ రాంబాబు, గౌరీ పట్టపు శ్రీను, గుర్రాల మరిడయ్య, గుర్రాల నాగరాజు, గుర్రాల శ్రీను, గాది సత్తిబాబు, గుర్రం నూకరాజు తదితర సగరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి తృతీయ బ్రహ్మోత్సవాలు ఈనెల 5 నుంచి 8 వరకు వార్షికోత్సవాలు జరుగుతాయని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 5 నుంచి 6 గంటలకు శ్రీ విశ్వక్సేన తిరువీధి ఉత్సవం విశ్వక్సేన ఆరాధన 6న ఉదయం శ్రీవారి మూలమూర్తి స్నాపన తిరుమంజను స్వామివారి తిరువీధి ఉత్సవం ధ్వజారోహణం గరుడ ప్రసాద వితరణ ఉత్సవ మూర్తుల స్వపనం, అగ్ని ప్రతిష్టాపన, అగ్ని ప్రతిష్టాపన, కుంభకళ అవగాహన, కుంభకర అవహనం, గరుడ వాహన ఉత్సవం ఏడవ తేదీ విశ్వక్సేన ఆరాధన ఆరాధన కుంభారాధన నిస్స హెూమం శ్రీవారి రథోత్సవం సాయంత్రం నిత్య ఆరాధన కుంభారాధన నిత్య హోమం సాయంత్రం ఏడు గంటలకు శ్రీనివాస కళ్యాణ మహోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారుల బృందంచే అన్నమాచార్య సంకీర్తన స్వరాభిషేకం, 8న ఆరాధన,8 తేదీన విశ్వక్సేన ఆరాధన కుంభారాధన నిత్య హెూమం మహా పూర్ణాహుతి కుంభకలాన్యాసం వేద ఆశీర్వచనం సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ద్వాదశ ప్రదర్శనలు శ్రీవారి డోలోత్సవం శ్రీ పుష్పయోగం ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు ఉంటాయి. దేవర పెళ్లికి చెందిన కేసిరాజు శారదా దేవితో సంగీత సంకీర్తన అమృతం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. మే 10 శనివారం ఉదయం 11 గంటల నుంచి ఆలయం వద్ద భారీ స్థాయిలో అన్న సమారాధన. ఈ కార్యక్రమంలో గుడ్ల వెంకటేశ్వరావు, గ్యాలం వెంకటేశ్వరావు, కొండపల్లి సత్యనారాయణ, వెలగా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలి : వైసీపీ

విశాలాంధ్ర - అమలాపురం : డెల్టాలో రబీ రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, లేకపోతే రైతులకు దన్నుగా ఉద్యమం చేస్తామని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం చేతులు ఎత్తివేసిందని ధ్వజమెత్తారు. తక్షణమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పునః ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మద్దతు ధరతో పూర్తిగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమలాపురం ప్రెస్ క్లబ్ భవనంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం అమ్మలేక అవస్థల పడుతున్న రైతులకు మద్దతుగా ఈ సమావేశం ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం కొనుగోళ్లను గందరగోళం సృష్టించారన్నారు. దళారులతో కుమ్మక్కై కొనుగోలు కేంద్రాల లక్ష్యాలు (టార్గెట్లు) పూర్తయ్యాయని కొనుగోళ్లు ఆపేయడంపై జగ్గిరెడ్డి నిలదీశారు. జిల్లాలో లక్ష్యాలు పూర్తయ్యాయని కొనుగోళ్లను నిలిపేసిన కూటమి ప్రభుత్వం అన్నం పెట్టె రైతుకు సున్నం పూసిన చందంగా వారి జీవితాలతో ఆటలాడుతోందని ఆరోపించారు. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల వారీగా ధాన్యం దిగుబడుల లక్ష్యాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు నుంచి పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేసిన పరిస్థితి ఈ కూటమి ప్రభుత్వంలో కనిపించడం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై మోసపూరిత ప్రకటనలు చేస్తూనే ఉన్నారని ధ్వజమెత్తారు. ప్రతీ సారి ప్రశ్నిస్తాను అని చెప్పే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఇప్పుడు ధాన్యం కొనుగోళ్ల వైఫల్యాలపై ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని జగ్గిరెడ్డి నిలదీశారు. ధాన్యం అమ్ముడుకాక, అకాల వర్షాలతో రైతులు పడుతున్న కష్ట, నష్టాలపై పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ఆయన మరో ప్రశ్న వేశారు. అమరావతి పనులు పునః ప్రారంభం కాదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను తక్షణమే పునః ప్రారంభించాలని ఆయ డిమాండు చేశారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మాజీ మంత్రి, రాజోలు నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు, అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ ధాన్యం పండించిన రైతులపై అటు ప్రభుత్వం పగ పట్టినట్లే ప్రకృతి కూడా అకాల వర్షాల పేరుతో పగపట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగ్గిరెడ్డి నాయకత్వంలో రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజా కొనుగోలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని వారు ప్రకటించారు. జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, అమలాపురం, అల్లవరం ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపతరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, అమలాపురం పట్టణం, రూరల్, అల్లవరం మండలాల పార్టీ అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడి భక్తులకు సామర్లకోటలో ఆతిథ్యం

విశాలాంధ్ర - సామర్లకోట : పూరీ క్షేత్రంలోని జగన్నాథుడి దర్శనార్థం మహారాష్ట్ర నుంచి పాద యాత్రగా బయలుదేరిన భక్తులకు సామర్లకోటలో అపూర్వ స్వాగతం పలికారు. పవిత్ర పూరి పుణ్యక్షేత్రం లో జరిగే ప్రసిద్ధ జగన్నాథుడి దేశ నలుమూలల నుండి భక్తులు తరలివస్తారు. మహారాష్ట్ర నుండి పూరి క్షేత్రానికి పాదయాత్ర చేపట్టిన భక్తుల బృందానికి సామర్లకోట యూత్ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం సామర్లకోట పట్టణంలో భక్తులకు భోజన వసతి సేవలు అందించారు. యూత్ సభ్యుల ఆతిథ్యం పట్ల మహారాష్ట్ర భక్తులు హర్షం వ్యక్తం చేశారు. జగన్నాథుడి కృపా కటాక్షాలు లభించడం తథ్యమని ఆశీస్సులు అందించారు.

కులగణనను స్వాగతిస్తున్నాం : సత్యలక్ష్మి

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఎప్పటినుండో ఈ అంశంపై మాట్లాడటం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కేంద్రం ఈ అంశంపై ముందడుగు వేసిందని పోరాటం ఫలితంగానే రూరల్ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పిల్లి సత్యలక్ష్మి చిన్న కేంద్ర ప్రభుత్వం ప్రకటించినటువంటి కులగనన అంశాన్ని స్వాగతిస్తున్నామని కాకినాడ రూరల్ నియోజవర్గం కాంగ్రెస్ కో ఆర్డినేటర్ పిల్లి సత్యలక్ష్మి చిన్న శనివారం కాకినాడ రూరల్ నియోజకవర్గం పర్యటనలో తెలిపారు. వెనుకబడిన కులాలకు న్యాయం జరగాలంటే కులగణను జరగాలని అటు పార్లమెంటులోనూ ఇటు రాజ్యసభలోని పదేపదే కాంగ్రెస్ పార్టీ సభల దృష్టికి తీసుకు వెళ్తుందని కేంద్రంపై ఒత్తిడి తెచ్చింది అన్నారు. ఆ అంశంపై రాహుల్ గాంధీ పార్లమెంట్లో మాట్లాడమే కాకుండా దేశంలో జరిగిన సభల్లో పలుమార్లు మాట్లాడడం జరిగిందని వారు గుర్తు చేశారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా నూతన కార్యవర్గంలో పెద్దాపురంకు ప్రాధాన్యత

విశాలాంధ్ర - పెద్దాపురం : ఏపీయూడబ్ల్యూజే కాకినాడ జిల్లా తొలి నూతన కార్యవర్గంలో పెద్దాపురం నియోజకవర్గానికి ప్రాధాన్యత లభించింది. జేఎన్టీయూ అల్యూమినియం ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన జిల్లా తొలి నూతన కార్యవర్గంలో పెద్దాపురం నియోజకవరానికి చెందిన ఐదుగురుకి స్థానం లభించింది. సీనియర్ జర్నలిస్టు దుర్రాని, యూనియన్ మాజీ అధ్యక్షులు స్వాతి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ సభ్యుడితో పాటు ఎలక్ట్రానిక్ మీడియా విభాగంలో జిల్లా ఉపాధ్యక్షుడు, కార్యవర్గ సభ్యుడు స్థానాలను పెద్దాపురం, సామర్లకోట సభ్యులు స్వాధీనం చేసుకు న్నారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పెద్దాపురంకు చెందిన రాకుర్తి రాంబాబు (సాక్షి), కోశాధికారిగా చవ్వాకుల ఈశ్వరరావు (ఆంధ్రప్రభ), జిల్లా కార్యవర్గ సభ్యుడుగా సామర్లకోటకు చెందిన ఎలిశెట్టి సత్యన్నారాయణ (విశాలాంధ్ర), ఎలక్ట్రానిక్ మీడియా విభాగం నుంచి సామర్లకోటకు చెందిన ఉప్పలపాటి చంద్రదాస్ (ఏపీటీఎస్ న్యూస్), జిల్లా కార్యవర్గ సభ్యుడుగా గోవిందలపూడి సుబ్రహ్మణ్యం (ఆర్టీటీవీ)లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నియోజ వర్గంలో సీనియర్ జర్నలిస్టు అడపా వెంకట్రావు (సాక్షి)ని అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. జిల్లా తొలి కార్యవర్గంలో ఎన్నికైన సభ్యులను పలువురు అభినందించారు.

శ్రీధర్‌కు సన్మానం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఇటీవల కాలంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా వైఎస్ఆర్‌సిపి జిల్లా అధికార ప్రతినిధిగా ఎన్నిక కాబడిన కప్పల శ్రీధర్ ర్యాలీ స్వగ్రామం కావడంతో గ్రామస్తులు ఆదివారం సాయంత్రం పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పెద్దలందరూ శ్రీధర్ ఘనంగా సన్మానించి శ్రీధర్ పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రాత్రిపూరం మండల జడ్పిటిసి భవనం సాయిబాబు నాగరాజు జీవీ లక్ష్మణరావు, కప్పల శ్యామ్ సుందర్ తదితర నాయకులు, అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సెట్టిబలిజ సంఘ అధ్యక్షుడిగా మీరా సాహెబ్ శెట్టి

విశాలాంధ్ర - అమలాపురం : గంగలకుర్రు అగ్రహారం సెట్టిబలిజ అధ్యక్షుడుగా ఎన్నికైన మట్టపర్తి మీరసాహెబ్‌శెట్టిని ఇరు గ్రామాల నాయకులు దుశ్శాలువతో సత్కారించారు. ఈ కార్యక్ర మంలో విత్తనాల ఇంద్రశేఖర్, దొంగ నాగేశ్వర రావు, కాండ్రేగుల శ్రీనివాస్, పితాని సత్తిబాబు, కట్టా సుబ్రహ్మణ్యం, వసచర్ల వెంకటేశ్వరరావు, గుడాల ఫణి, దొమ్మేట్ రాంబాబు, విత్తనాల రామరాజు, రాయుడు భుసేంకర్, రాయుడు సత్యనారాయణ, మట్టపర్తి రెడ్డమ్మ, దంగేటి కృష్ణారెడ్డి, కొప్పిశెట్టి రాంబాబు, గుబ్బల రమణ, పలివేల సుబ్రహ్మణ్యం, రాయుడు మీరయ్యే, రాయుడు కృష్ణ, మహేష్, కుడుపూడి శ్రీనివాస్, రాయుడు చంటి, దంగేటి రవి, రాయుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి సగర సోదరులందరికీ పంపిణీ చేశారు. మరో అతిథిగా హాజరైన ములికి సత్యనారాయణ కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టీడీపీ నాయకులు మారిశెట్టి భద్రం, సగర నాయకులు నక్కా కిషోర్, తంగేళ్ల అప్పారావు, పోట్రూ కృష్ణ, నక్క కృష్ణ, ములికి వీర రాఘవులు, తంగేళ్ల సుబ్బారావు, నక్క వెంకటేష్, చనిబోయిన నూకరాజు పాల్గొన్నారు.

ట్రాన్స్ పోర్ట్ రంగ సమస్యలపై 6న రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర - కాకినాడ : ట్రాన్స్ పోర్ట్ రంగ సమస్యలపై ఈనెల 6 మంగళవారం ఉదయం 10గం.కు సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టంలో కొన్ని సెక్షన్లు డ్రైవర్ల జీవితాలను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా వేస్తున్న ట్రాక్సులు, అపరాధ రుసుములు ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయన్నారు. వీటికి తోడు పెట్రోల్ డీజిల్ ధరలు, పెరుగుతున్న స్పేర్ పార్ట్‌ల ధరలతో ఓనర్ కం డ్రైవర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మే 20న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ట్రాన్స్ పోర్ట్ సంఘాలు భాగస్వాములు అవుతు న్నారని తెలిపారు. రౌండ్ టేబుల్ సమావేశంలో కాకినాడ నగరంలో వివిధ ట్రాన్స్ పోర్ట్ రంగాల నాయకులు పాల్గొనాలని రమణ, వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

కట్టుకున్న భర్తనే కడతేర్చిన మహిళ

గొల్లప్రోలులో వీడిన మిస్టరీ

విశాలాంధ్ర - గొల్లప్రోలు : వివాహేతర అక్రమ సంబంధం పెట్టుకుని ప్రియుడు సహాయంతో కట్టుకున్న భర్తనే కడ తెరిచింది ఒక ఇల్లాలు. వివరాల్లోకెళ్తే కాకినాడ నుండి కత్తిపూడి వెళ్లే నేషనల్ హైవే మార్గంలో చేబ్రోలు వద్ద మార్చి 3నన గుర్తు తెలియని మృతదేహం పడి ఉంది. అది చూసిన స్థానికులు మృతదేహం చూసి పోలీసులకు సమాచారం అందించారు. గొల్లప్రోలు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో మృతుడు అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలం ధర్మవరం ప్రాంతానికి చెందిన తంగిళ్ళ లోవరాజుగా గుర్తించారు. పోలీసులు లోతుగా విచారణ చేపట్టడంతో అసలు విషయం బయటపడింది. మృతుడు తంగెళ్ల లోవరాజు భార్య తంగేళ్ల శ్యామల మండే మోహన్ కుమార్‌తో అక్రమ సంబంధం పెట్టుకుని అక్రమ సంబంధానికి అడ్డువస్తున్న తంగెళ్ల లోవరాజును హత మార్చారు. తంగెళ్ల శ్యామల, మండే మోహన్‌కుమార్, బల్ల గంగాధర్ ముగ్గురు వ్యక్తులు ఇంట్లో నిద్రిస్తున్న తంగెళ్ల లోవరాజును సర్జికల్ బ్లేడుతో శరీరంపై కోసి దారుణంగా హత మార్చారు. ఎవరికీ తెలియకుండా తంగెళ్ల లోవరాజు మృతదేహాన్ని కారులో ఎక్కించుకొని చేబ్రోలు హైవే పై పడవేశారు. పోలీసులు విచారించి నిందుతులైన తంగెళ్ళ శ్యామలను, మండే మోహన్ కుమార్‌ను బల్ల గంగాధర్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఈ మర్డర్‌కి సంబంధించిన వివరాల తెలియజేయడానికి కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ గొల్లప్రోలు పోలీస్ స్టేషన్లో శనివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మర్డర్ జరిగిన విషయాలను మీడియాకు తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ దేవరాజ్ మానిష్ పటేల్, పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసు, ఎస్ఐలు రామకృష్ణ మణికుమార్, జాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మహానుభావుడు భగీరథ మహర్షి : పద్మశ్రీ

విశాలాంధ్ర - కాకినాడ : భగీరథ మహర్షి తన అకుంఠిత దీక్ష పట్టుదలతో అఖండ ప్రాణికోటికి నీరు అందించిన గొప్ప మహానుభావుడని శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి పురస్కరించుకుని కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పద్మశ్రీ హాజరై భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎందరో మహా ఋషులు, మహానుభావులకు నిలయం అయిన మన భారత దేశం పుణ్యదేశం అన్నారు. అకుంఠిత దీక్ష పట్టుదలతో అఖండ ప్రాణికోటికి భగీరథ మహర్షి నీరు అందించి మనకందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. పట్టుదల, తపన ఉంటే ఎంత కష్టమైనా పనినైనా సాధించవచ్చు అని భగీరథ మహర్షి జీవితం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. కాలగర్భంలో కలిసిపోతున్న ఎందరో మహనీయుల యొక్క సేవలను, వారి చరిత్రను నేటి తరానికి అందించేనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారంగా చేయడం గొప్ప శుభ పరిణామం అని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రామ్మోహన్ రావు, సగర సంక్షేమ సంఘం సభ్యులు ఇతర ప్రజా సంఘాల నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం : జగ్గిరెడ్డి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆరు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని కానీ టార్గెట్ల పేరుతో 24% అంటే 2 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని కూటమి ప్రభుత్వంలో రైతుల కన్నా మిల్లర్లకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన అన్నారు. వాతావరణంలో మార్పులతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా ఉందని వాళ్ళని పట్టించుకునే నాధులు లేరని ఆయన అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ధరల స్థిరీకరణ నిధి కింద ఐదు సంవత్సరాలలో 7796 కోట్లు ఖర్చు చేసి ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేశారు. నేడు ధరల స్థిరీకరణ నిధి కింద కేవలం రూ. 30 కోట్ల కేటాయించారన్నారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమిస్తామని జగ్గిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమలాపురం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా యాళంగి

విశాలాంధ్ర - అమలాపురం : డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమితులైన న్యాయవాది యాలంగి సత్యనారాయణని దేవగుప్తం సర్పంచ్ సాధనాల వెంకట్రావు స్వగృహం నందు సర్పంచ్ వెంకట్రావు దంపతులు యాలంగి సత్యనారాయణని దుస్సాల్వతో సత్కరించారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ న్యాయవాదిగా యాలంగి సత్యనారాయణ పెద వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఆపదలో ఉన్న వారి పక్షాన తోడుగా నిలబడటానికి ఎప్పుడు వెనుకాడదని కష్టపడి చదుకుని ఎన్నో అసమానతలు నడుమ అడుగడుగున ఇబ్బందులు అదిగమించి న్యాయవాది పట్టా అందుకొని చిన్ననాటి నుంచి తాను పడిన కష్టం నేటికీ మర్చిపోకుండా, పెద వర్గాలు, శ్రమ జీవులు పక్షాన పోరాడుతూ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం లీగల్ అడ్వాజరీ న్యాయ సహాయం అందిస్తూ అమలాపురం న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఏకగ్రీవంగా నియమితులైనందుకు అభినందిస్తూ బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులందరికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కాశీ బాలయోగి, యువనాయకులు సాధనాల శ్రీనువాసరావు, రాజు, ఎస్ శ్రీను, సీనియర్ అడ్వకేట్ బడుగు సత్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిదుర్గారావు, మండల కన్వీనర్ గెద్దం విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అందుబాటులోకి అత్యాధునిక కంటి వైద్యం

విశాలాంధ్ర - అనపర్తి : అత్యాధునిక కంటి వైద్య టెక్నాలజీ సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక నారాయణరెడ్డి కంటి ఆసుపత్రి అధినేత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కంటిలో మసకబారి నలెన్స్ తీసివేసి ఆ స్థానంలో కృత్రిమలెన్స్ అమర్చే శస్త్ర చికిత్సను కెటారాక్ట్ సర్జరీ అంటారని అమెరికాలో ప్రథమంగా ఉన్న ఆర్గోస్ ఆప్టికల్ బయోమీటర్ ద్వారా కెటారాక్ట్ శస్త్ర చికిత్సతో అవసరమైన లెన్స్ పవర్ ఖచ్చితంగా లెక్కించవచ్చని ఆయన చెప్పారు. ఆర్గోస్ బయోమీటర్ అత్యాధునిక స్వెప్ట్ సోర్స్ ఓక్ట్ టెక్నాలజీని ఉపయోగిస్తుందని అన్నారు. ఈ మెషీన్ సౌకర్యం ఇప్పటివరకు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో మాత్రమే ఉందని ఇటువంటి అధునాతన సౌకర్యాన్ని నారాయణరెడ్డి కంటి ఆస్పత్రిలో కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని డాక్టర్ వెంకటరామిరెడ్డి వివరించారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కళ్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరుపుడైన వెంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి కాతేరు వాస్తవ్యులు వెంకటేష్, ప్రణవి చౌదరి, వారి కుటుంబ సభ్యులు రూ.50116 అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధి కారి నల్లం సూర్య చక్రధరరావు చేతుల మీదుగా స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - జగ్గంపేట : అకాల వర్షంతో తడిసి ముద్దైన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు-కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజ నేయులు డిమాండ్ చేశారు. మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో తడిసిన ధాన్యాన్ని రైతు కూలీ సంఘం బృందం ఆదివారం పరిశీలించి జగ్గంపేట, పెద్దాపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ మిల్లర్లను హెచ్చరించినా తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో రైతులు వేచి చూశారన్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు కురవడంతో ధాన్యం తడిచిపోవడం జరిగిందన్నారు. కలెక్టర్ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి రమేష్, పిడిఎస్‌యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, అర్జున్, రవణ రైతులు పాల్గొన్నారు.

ప్రముఖ వంట మాస్టర్ షేక్ వల్లి బాష దారుణ హత్య

విశాలాంధ్ర - నిడదవోలు : ఆదివారం ఉదయం తెల వారుతుండగానే ప్రముఖ వంట మాస్టర్ షేక్ వల్లి బాష హత్య నిడదవోలులో కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం నిడదవోలు పట్టణానికి చెందిన వంట మాస్టర్ వల్లి భాష చింత చెట్టు వీధిలో తన కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. వంటలు చేయడంతో పాటు ఇంటివద్దే చిన్న కిళ్లీ కొట్టును నిర్వహి స్తున్నాడు. నమాజ్ అనంతరం ముందుగా కుదుర్చుకున్న వంటలు చేసేందుకు ఆదివారం ఉదయం నాలుగు గంటలకు రాజ మండ్రి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా వల్లి ఇంటి వద్దే వైయస్సార్ కాలనీకి చెందిన యువకుడు వల్లి పై దాడి చేసి కిరాతకంగా హత్య చేశాడు. వల్లి భాష ప్రముఖ వంట మాస్టర్గా ప్రసిద్ధి చెందడంతో పాటు, అందరికీ సుపరిచితమైన వల్లి భాష హత్య గావించబడిన వార్త క్షణాల్లో పట్టణమంతా వ్యాపించింది. హత్యా సమాచారాన్ని అందు కున్న నిడదవోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరణ అనంతరం పోస్టు మార్టం నిమిత్తం వల్లి మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిడదవోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్యకు గతంలోని ఫోక్సోకేసే కారణమా......

వల్లి భాష హత్యకు గతంలో నమోదయ్యి కోర్టులో నడుస్తున్న ఫోక్సొకేసే కారణమని పోలీసులు, స్థానికులు పేర్కొన్నారు. హత్యకు గురైన వల్లి భాష కుమార్తెను లైంగికంగా వేధిస్తున్నాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వైయస్సార్ కాలనీకి చెందిన సిరంగల అనిల్ అనే యువకుడుపై 2021లో ఫోక్సో నమోదు చేశారు. ప్రస్తుతం ఆ కేసు జిల్లా కోర్టులో ముగింపు దశలో ట్రయల్ ఉన్నది. ఆ కేసులో శిక్ష తప్పదని భావించిన అనిల్, వల్లితో రాజీ ప్రయత్నాలు చేసినా అవిబెడిసి కొట్టాయి. దీంతో కక్ష పెంచుకున్న అనిల్లె హత్య చేసినట్టు వల్లి కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

హత్యను చేదించిన పోలీసులు

వంట మాస్టారు వల్లి భాష హత్య జరిగిన వెంటనే ప్రాథమిక విచారణ అనంతరం వెంటనే స్పందించి పోలీసులు అనిల్ ని కస్టడీలోకి తీసుకున్నారు. సిరంగల అనిల్ 2021లో బాలికను ఏడిపించాడని పాతకేసుకు సంబంధించిన విషయంలో ఇరువురికి పూర్తిగా వ్యక్తిగతమైన మనస్పర్ధలు ఉన్న కారణంగా హత్య జరిగినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. హత్య జరిగిన వెంటనే పోలీసులు స్పందించి కొద్దిసేపట్లోనే నిందితుడు సిరంగల అనిల్ ను అదుపులోకి తీసుకున్నట్లు కొవ్వూరు డీఎస్పి తెలిపారు .

సీనియర్ జర్నలిస్టు సోమేశ్వరరావుకు సత్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ప్రత్తిపాడు సాక్షి రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్గా ఎస్వీ సోమేశ్వరరావును ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో ఎస్వి సోమేశ్వరరావు ఘనంగా సత్కరించారు. జేఎన్టీయూలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే కాకినాడ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, జిల్లా అధ్యక్షులు కేవివి స్వాతిప్రసాద్, సీనియర్ జర్నలి స్టులు మండేలా శ్రీరామ్మూర్తి, దుర్రానీ తదితదులు హాజర య్యారు. ఈ సభలో యనమల రామకృష్ణుడు చేతుల మీదుగా సన్మానం అందుకున్న సీనియర్ జర్నలిస్ట్ ఎస్వీ సోమేశ్వరరావును స్థానిక ప్రెస్ క్లబ్ సభ్యులు అభినందించారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర ఏలూరు:వాతావరణ శాఖ ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు,ఈదురు గాలుల హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అప్రమత్తం చేశారు.భారీవర్షాలు ప్రారంభం కాగానే కలెక్టరేట్కు చేరుకొని కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో వివిధ న్యూస్ చానెల్స్ ప్రసారం అయ్యే ఏలూరు జిల్లాలో భారీ వర్షాల కారణంగా చెట్లు,విద్యుత్ స్తంబాలు కూలడం వంటి అంశాలను పరిశీలించి వెంటనే తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సెల్ ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.ఏలూరు నగరం,భీమడోలు మండలం గుండుగొలను, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చింతల పూడి, నూజివీడు, తదితర ప్రాంతాలలో చెట్లు కూలి ట్రాఫిక్ నకు ఆటంకంగా ఉందని,విద్యుత్ స్తంబాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిందని వచ్చిన అంశాలపై కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత శాఖల అధికారు లకు వెంటనే సెల్ ఫోన్ ద్వారా ఫోన్ చేసి జెసిబి ల సహాయంతో చెట్లు తొలగించి ట్రాఫిక్ నకు ఎటువంటి ఆటంకం కలగ కుండా చూడాలని,విద్యుత్ స్తంబాలకు పునరు ద్ధరించి విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అధికారులు కూడా మీడియా గ్రూప్ లలో వచ్చే అంశాలను పరిగణనలోకి తీసుకుని,తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయము చేసుకుని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ధాన్యం వర్షార్పణం

- జిల్లాలో ధాన్యం దిగుబడి 9.25 లక్షల టన్నులు
- ఇప్పటి వరకు సేకరించింది 4.45 లక్షల టన్నులు మాత్రమే

విశాలాంధ్ర -భీమవరం: ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి కళ్లాల మీద ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఈ రబీకి 9.25 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కావచ్చునని వ్యవసాయ శాఖ అంచనా. ఇందులో రైతులు బహిరంగ మార్కెట్ లో అమ్ముకోడానికి, రైతు స్వంత అవసరాలకు సుమారు 1.50 లక్షల టన్నులు పోగా, 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ద్వారా కొనుగోలుకు ముందుకొచ్చి, మరో 1.50 లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు చేయడానికి సూత్రప్రాయంగా అంగీకరించింది. మొత్తం సేకరించాల్సిన 7.75 లక్షల టన్నుల ధాన్యానికి గాను ఇప్పటి వరకు 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 4,45,876 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. ఇంకా రైతుల వద్ద వివిధ దశల్లో 3,29,124 మెట్రిక్ టన్నులు ధాన్యం పనల మీద, కళ్లాలపైనా ఉంది. ఇదిలా ఏ మేరకు రైతాంగానికి నష్టం వాటిల్లిందనేది సోమవారం నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఆకట్టుకుంటున్న కళారూపాలు

విశాలాంధ్ర - ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో కాంపౌండ్ వాల్కి అన్ని వైపులా గోడలపై చిత్రీకరించిన కళాకృతులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. జానపద కళలు, పల్లె జీవన విధానం, వివిధ వృత్తులు, వ్యవసాయం, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా గీసిన చిత్రాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఏలూరు నగర సుందరీకరణ లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ కాంపౌండ్ వాల్ కి కుడి, ఎడమవైపు గోడలపై ఈ తైల వర్ణ చిత్రాలను వేశారు. జీవం ఉట్టిపడేలా వేసిన ఈ పెయింటింగ్స్ ను కలెక్టరేట్ వైపు వెళ్లే సందర్శకులు తమ వాహనాలను ఆగి మరి వీక్షిస్తున్నారు. కళాకారుల ప్రతిభను మెచ్చుకుంటున్నారు.

కడియపులంక నర్సరీలకు అత్యంత ప్రాముఖ్యత : మంత్రి నిమ్మల

విశాలాంధ్ర - కడియం : పాలకొల్లు సిటీలో ఆదివారం జరిగిన లైన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్టిక్ 316 కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనకు సత్యదేవా నర్సరీ అధినేత, మాజీ ఐఎన్ఏ ప్రధాన కార్యదర్శి పుల్లా వీర వెంకట్రావు దుస్సాలువా, పూలమాల వేసి సత్కరించారు. మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ మన రాష్ట్రంలోని కడియపులంక నర్సరీలు దేశ విదేశాలలో అత్యంత ప్రాముఖ్యత సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ప్రపంచ పచ్చదనానికి, సుందరీకరణకు నిరంతరం కృషి చేస్తున్న శ్రీసత్యదేవా నర్సరీ యాజమాన్యాన్ని, నర్సరీ రైతులని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో నర్సరీ రైతులు పుల్లా ఆంజనేయులు, పుల్లా పెద్ద సత్యనారాయణ, పుల్లా చిన సత్యనారాయణ, పుల్లా వీర్రాజు, పుల్లా రాజశేఖర్, నక్క అమ్మిరాజు, కర్రే ఎస్సై, పుల్లా శ్రీకాంత్ పెమ్మనబోయిన పెదకాపు, కొండేపూడి నాగు, వజ్రపు కోటేశ్వరరావు (లైన్స్ గవర్నర్) తదితరులు పాల్గొన్నారు.

5020 టన్నుల ధాన్యం కొనుగోలుకు మంత్రి ఆదేశం

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు మండలంలోని 21 రైతు సేవా కేంద్రాల ద్వారా 5020 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. వియత్నాం పర్యటనలో ఉన్న మంత్రి దుర్గేష్ నిడదవోలు మండలంలోని 21 గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని ఆదివారం అధికారులను ఆదేశం చారు. త్వరలోనే నియోజకవర్గంలోని మిగితా ప్రాంతాల్లో మరిన్ని టన్నుల ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంచమని రైతులు అడిగిన వెంటనే స్పందించి చర్యలు చేపట్టిన మంత్రి కందుల దుర్గేష్ పని తీరుపై నియోజకవర్గ రైతాంగం సంతోషం వ్యక్తం చేసింది.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడిగా లోవరాజు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) కాకినాడ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ప్రత్తిపాడు మండలం చెందిన విశాలాంధ్ర రిపోర్టర్ బర్ల లోవరాజు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కాకినాడ జేఎన్టీయూ అల్యూమినియం హాల్లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిలుగా మాజీమంత్రి, సీనియర్ టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల అధికారులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవి సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టులు కే స్వాతి ప్రసాద్, దుర్రానిలు వ్యవహరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన లోవరాజును ప్రత్తిపాడు ప్రెస్ క్లబ్ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.